# అంటుముడి

"అమ్మా!,

"నీ ఉత్తరం అందింది. చాలా పెద్ద ఉత్తరమే రాశావు. నా ముప్పయి అయిదేళ్ళ జీవితంలో నీ నుండి అంత పెద్ద ఉత్తరం అందుకోవడం ఇదే మొదటిసారి. నువ్వు నా ఎదురుగా కూర్చుని ఎన్నో సంగతులు చెబుతున్నట్టుగా అనిపించింది. చదువుతున్నంత సేపూ నిగ్రహించుకున్న వాడిని, చదివాక దుఃఖం ఆపుకోలేకపోయాను. చాలా సేపటి వరకు ఏడుస్తూ ఉండిపోయాను. నువ్వు ఉర్దూ బాగా మాట్లాడతావు. చక్కగా రాయడం కూడా చూశాను. తెలుగు కూడా బాగా మాట్లాడుతుంటావు. తెలుగు ఎంతో మంచిగా రాయగలవని నీ ఉత్తరం చూశాకగాని తెలుసుకోలేక పోయాను. నీ ఉత్తరాన్ని పదే పదే చదువుకున్నాను.

"అప్పుడప్పుడు చేస్తున్న ఈ ఉద్యోగం మానేసి వచ్చి నీ దగ్గర ఉండిపోదా మనిపిస్తూంటుంది. రాలేను. నా జీవితానికి బందీ అయిపోయాను. నువ్వు నా కోసం చెల్లెలు కోసం పడిన కష్టాలు తల్చుకుంటే మనసు బాధతో నిండిపోతుంది. నీ బాకీ తీర్చగలనో, లేదో?

"పిల్లలు బావున్నారు. బాగా చదువుకుంటున్నారు. నా భార్య బావుంది. మనిషేం మారలేదు. మారుతుందని అనుకోవడం మానేశాను. నా జీతం తన చేతికి ఇవ్వడం రెండు రోజులు ఆలస్యం అయితే సరాసరి మా మేనేజింగ్ డైరక్టర్ ఛాంబరుకు వచ్చేస్తుంది. జీవితం నాకు నిటారుగా లేదు. తలకిందులుగా ఉంది. వచ్చిన జీతం వచ్చినట్టు ఆమె చేతికి ఇవ్వవలసిందే. ఎంతో కొంత నాకిస్తుంది. ఏ మాత్రం సరిపోదు. కొన్నిసార్లు స్కూటరు పెట్రోలుకు డబ్బులుండవు. నాలుగు కిలో మీటర్లు ఏ ట్రాఫిక్‌జాం లేకుండా నడుచుకుంటూ వెళ్ళి పోతుంటాను. అసలు ఫైన్‌ఆర్ట్స్ ఎందుకు తీసుకున్నానా అనిపిస్తూంటుంది. పార్ట్‌టైంగా మరో రెండు చోట్ల పనిచేస్తున్నాను. ఎవరూ సరిగా డబ్బులివ్వరు. నాకే అనుకుంటే నా సీనియర్లను కూడా అలానే ఇబ్బందులు పెడుతుంటారు.

బి.పి.కరుణాకర్

"అసలు విషయానికి వస్తాను. నిజానికి ఖాన్‌సాబ్ దగ్గరకు వెళ్ళడం నాకు ఇష్టం లేదు. నీ మాట కాదనలేక పోయిన ఆదివారం ఉదయం పది గంటలప్పుడు ఆయన ఇంటికి వెళ్ళాను. అప్పటి ఇల్లే బంగాళాలా తయారయింది. ప్రహరీ గోడ ఎత్తుగా కట్టారు. ఇంటికి కాపలా దార్లతో పాటు దున్నపోతులంత కుక్కలు. ఆ హంగు చూశాక నాకు తెలియకుండా కుంచించుకుపోయినట్టు అనిపించింది.

"నా పేరున్న ఆఫీసు విజిటింగ్ కార్డు ఇచ్చాను. పత్రికాఫీసు నుండి అనేసరికి లోపలికి వెళ్ళడానికి అనుమతి దొరికింది. విజిటర్స్ గదిలో కూర్చోబెట్టి కాఫీ ఇచ్చారు. ఆ గది అందంగా అలంకరించబడి ఉంది. సోఫాలు, కర్టన్లు అన్నీ ఖరీదయినవే. నేనూ, చెల్లాయి చిన్నప్పుడు ఆ ఇంట్లో ఆడుకున్నామంటే ఎవరివరకో ఎందుకు, నామటుకు నాకే నమ్మకం కలగలేదు. అన్నిటికంటే నన్ను ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే నీ క్యారికేచర్, అప్పుడెప్పుడో నేను వేసింది. చాలా సంవత్సరాలు గడిచి పోయినా లేమినేట్ చేయబడి, ఈ మధ్యే వేసినంత కొత్తగా, అందంగా ఉంది. నా మటుకు నాకు ఆ గదికి నీ క్యారికేచర్ ప్రత్యేక ఆకర్షణలా ఉంది. సంతోషంతోనో, దుఃఖంతోనో కన్నీళ్ల ఉబుకుతోంటే ఆపుకున్నాను. నేను వచ్చిన పనివేరు.

"ఆ ఇంటి ఎదుట నుండి అనేకసార్లు వెళ్లాను. ఆ ఇంటి వయిపు చూడాలని అనిపించేదికాదు. ఇప్పుడు ఆ ఇల్లు ముఖ్యంగా నీ బొమ్మ ఉన్నగది అపరూపంగా ఉన్నట్టు అనిపించింది.

"ఖాన్ సాబ్ అప్పటికింకా రాలేదు. మరొకసారి కాఫీ తీసుకు వచ్చి ఇచ్చారు. వేడిగా ఉన్నా నాలుగయిదు గుక్కల్లో తాగేశాను. ఆకలిగా ఉంది. అంతకు ముందటి రాత్రి భోజనం చేయలేదు. రాత్రి నేను ఇంటికి రావడం ఆలస్యం అయ్యేసరికి ఎక్కడో తిని వస్తానని నాకోసం ఉంచిన భోజనం మీ కోడలు కుక్కకు వేసింది. నా మీద కోపం అని అనుకోను. నా మీద కోపం తెచ్చుకుని, తెచ్చుకుని విసుగెత్తిపోయి ఉండాలి. కోప్పడడం మానేసింది. అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది. ఆమెను ఎంతగానో ప్రేమించి మిమ్మల్నందరినీ కాదనుకుని ఎందుకు పెళ్ళి చేసుకుని తొందరపడ్డానా అని!

"క్యారికేచర్ అంటే నాకు వెంటనే గుర్తు వచ్చేది ధీరేంద్రాచారి. తెలుగు సాహిత్యంతో పరిచయం ఉన్న దానివి, నువ్వతని పేరు వినే ఉంటావు. అతని రచనలు చదివే ఉంటావు. ఇప్పుడతనికి యాభయి అయిదేళ్లు పయిబడే ఉంటాయి.

ఇక్కడే ఉంటాడు. పత్రికల్లో అతని వ్యాసాలు. పజిల్స్, సీరియల్స్, కథలు వస్తుంటాయి. అతని భాష బావుంటుంది. అతని చాలా రచనలు మిగతా భాషల్లోకి తర్జుమా చేయబడ్డాయి. అతను రాసేవి చాలా మటుకు ఇంగ్లీషు నుండి మక్కీకి మక్కీ తస్కరించబడినవి అయినా అతనంటే నాకు అభిమానం పోలేదు. గమ్మత్తేమిటంటే చాలా మంది రచయితలు కాని కవులు కాని వాళ్ల రచనలంత నిజాయితీగా ఉండరు.

"ధీరేంద్రాచారి అప్పుడప్పుడు మా పత్రికాఫీసుకు వస్తుంటాడు. నాకు మించిన అభిమానులు అతనికి మా ఆఫీసులో ఉన్నారు. అతను రాగానే చుట్టూ చేరి పొగడ్తలతో ముంచేస్తుంటారు. అతనిలో మాట్లాడదామని నాకు ఎంతగానో ఉండేది. అవకాశం చిక్కేది కాదు. సబ్ ఎడిటర్ స్థాయి తక్కువ వ్యక్తులతో మాట్లాడడానికి అతను ఆసక్తి చూపించేవాడు కాదు. ఈ మధ్య అతను వచ్చినప్పుడు నన్ను నేను పరిచయం చేసుకుని నేనెంతో ఇష్టంతో వేసిన అతని క్యారికేచర్ ఇచ్చాను. చుట్టబడి ఉన్న షీటు విప్పాడు. అది వేయడానికి నేనెంత కష్టపడ్డానో అతనికి తెలిసి ఉంటే నన్ను తప్పక అభినందిస్తాడనిపించింది. ఎలా మొదలెట్టాలో నాకు అర్థం కాలేదు, మాటల కోసం తడుముకుంటోంటే మామూలు కాయితం చూసినట్టుగా చూసి షీటు చుట్టి చేత్తో పట్టుకున్నాడు. మర్యాద కోసమయినా క్యారికేచర్ ఎలా ఉందో చెప్పక పోయినా, కనీసం 'థేంక్స్' కూడా చెప్పలేదు. అతని తత్వమే అంతేనేమో అనిపించింది.

"క్యారికేచర్ గురించి ఒక్క మాటయినా అతని నోట విందామని అతను మా ఆఫీసు మెట్లు దిగుతోంటే నేనూ నాలుగు మెట్లు వెనకగా దిగసాగాను. అతని పక్కనే మా చీఫ్ సబ్ ఎడిటర్ ఉన్నాడు. మెట్లు దిగుతున్న వాడల్లా వెనక్కి తిరిగి నన్ను చూసి చీఫ్ సబ్ ఎడిటర్‌తో, 'మీ వాడు నా వెంటబడ్డాడు. డబ్బుల కోసమా? వందరూపాయలు ముఖాన కొట్టేదా?' అన్నాడు. ఆ మాటలు నేను వింటున్నానని ఇద్దరికీ తెలుసు. 'వాడి ముఖం. ఎందుకివ్వడం?' మా వాడి జవాబు. అభిమానాలు ఎంత తేలికగా ఆర్పేస్తారు? చటుక్కున ఆగి, వెనక్కి తిరిగాను. ఆ సాయంత్రం ఆఫీసునుండి బయటకు వస్తున్నప్పుడు మా రిసెప్షనిస్టు బల్ల పక్కన ఉన్న చెత్త బుట్టలో ధీరేంద్రాచారి క్యారికేచర్ చూశాను. దాన్ని అందుకుని ముక్కలు ముక్కలు చేస్తోంటే బాధ అనిపించలేదు.

"ఖాన్ సాబ్ విషయానికి వస్తాను. అరగంట పయిగా ఎదురు చూశాక ఆయన వచ్చాడు. ఆయన మీద నేనే వయసున్నవాడిలా అనిపించింది. లేచి నుంచోబోతోంటే కూర్చోమన్నట్టు చేయి ఆడించాడు. ఆయన కూర్చున్నాక నేను

కూర్చున్నాను. ఆయనలో అట్టే మార్పులేదు. మునుపటి మీద కొద్దిగా లావయ్యాడు. చెంపల మీద జుట్టు మటుకు తెల్లబడింది. నా కార్డు చూసి, 'ఇంటర్వ్యూ కావాలా? ఇవేళ నాకంత సమయం లేదు. బయటకు వెళ్ళాలి. కాఫీ తాగుతావా?' అడిగాడు.

"ఆయన నన్ను గుర్తు పట్టినట్టులేదు. 'ఇప్పటికే ఇంట్లో కాఫీ రెండు సార్లు తాగాను. వద్దు . నేను ఇంటర్వ్యూ చేయడానికి రాలేదు. మీకు నేను గుర్తున్నానా?' అడిగాను నా ముఖంలోకి పరీక్షగా చూసి తల అడ్డంగా ఆడించాడు. 'నేను రహీమ్‌ను' అన్నాను. నా పేరు కొత్తగా వినిపిస్తున్నట్టు అనిపించలేదు. ఆయన దగ్గరకు వెళ్లకుండా ఉండవలసింది.

"నేను ఫాతీమా కొడుకును" అన్నాను.

"ఏ ఫాతిమా?"

"గుంటూరు, గుండారావుపేట"

గది తలుపు వంక చూశాడు. ఎవరూ లేరు. "మస్తాన్ దర్గా దగ్గర...." అంటున్నాను.... "నువ్వు నాకు తెలియదు. మీ అమ్మ తెలియదు. దయచేసి బయటకు వెళ్ళు. మళ్ళీ ఎప్పుడూ రాకు. వస్తే మర్యాదగా ఉండదు" అంటూ లేచి నుంచున్నాడు. నేనూ నిలబడ్డాను. నా కళ్ళల్లో నీళ్లు తిరుగుతున్నాయి. కన్న కొడుకుగా నన్ను గుర్తించడం లేదు. అతన్ని తీసుకొచ్చి ఎంతో ఉన్నత స్థితిలో పెట్టిన నిన్ను గుర్తు పట్టడానికి ఇష్టపడడం లేదు. గోడకు తగిలించి ఉన్న క్యారికేచర్ చూపిస్తూ, 'పోనీ, అది ఎవరు వేశారో గుర్తు తెచ్చుకోండి' అన్నాను. టీపాయ్ మీదున్న గ్లాసు అందుకుని క్యారికేచర్ మీద విసిరాడు. గ్లాసు బద్దలయింది.

"అక్కడ ఒక్క క్షణమయినా ఉండ బుద్ధికాలేదు. నువ్వూ, నేను, గతంతో ఆయనకు నిమిత్తం లేదు. మనం ఎప్పుడో చనిపోయాం. బయటికు వచ్చేశాను. నువ్వు ఉత్తరంలో అడిగిన అన్నిటికీ కాకపోయినా కొన్ని ప్రశ్నలకయినా జవాబు రాశానని అనుకుంటున్నాను. అమ్మా! నా బాధ ఒక్కటే. నీకు దొరికినంత మంచి నాన్న నాకెందుకు దొరకలేదా అని! మళ్ళీ ఉత్తరం రాస్తాను.

ప్రేమతో
నీ
కుమారుడు
రహీమ్."

* ఆదివారం వార్త, 13 జూన్ 2010